కథ

# ఇల్లు బాబోయ్ 'ill'

- మురళీమోహన్ క్రోవి

'**కోటి** విద్యలు కూటి కొరకే, అవసరానికి అన్నీ అబద్ధాలే'. చురకవేసే సామెతలు ఎన్ని వున్నా, నిజాలు తప్పించుకోలేవు, మాటల సందడిలో, మనసులో మెదులుతున్న అలజడుల ఒరవడిలో. అందుకనే అన్నారు పెద్దలు మాటలు జవదాటొద్దని. యిల్లు అంటే యిరువైపుల నుంచి అల్లుకుబోయే నవ్వారు మంచం లాంటిది.

సాయంత్రం ఆరుగంటలైనా రాఘవ ఆఫీసు పరిసరాలని వదలలేదు. అలాగని పనిలో నిమగ్నమూ కాలేదు. యింటికి వెళ్ళాలనిపించక క్లబ్ వైపు అడుగులు వేశాడు. ఎవరూ పరిచయస్థులు కనిపించక టి.వి.కి అతుక్కు పోయాడు. ఏవో పనికి రాని పాటలు. గొంతులో లేక గతుకుల గుంటలలో నడకలో తెలియక సతమత మవుతున్న ఆ నాట్యాలు చూడలేక వేరొక ఛానెల్‌కెళితే, ప్రొద్దున్న యింట్లో చెప్పిన వార్తలే మళ్ళీ తిరగతోడి చెప్పుకు పోతున్న వార్తాహరులు. ఎందుకో తెలియని చిరాకు తనంతో అక్కడ కూచోలేక బయటకొచ్చాడు రాఘవ.

'ప్రొద్దున మాలినితో తను అలా మాట్లాడకుండా వుండవలసింది. కొంచెం సేపు నోరు మూసుకొని, ఓర్చుకో వచ్చు కదా తను మాత్రం. చిన్నమాటతో మొదలైన సంభాషణ, దూషణలతో దూరం చేసింది యిద్దరినీ. యిది మొదటిసారి కాదు, పెళ్ళైన పదేళ్ళలో వందలసార్లు, లెక్కించక పోయినా చెప్పగలను.'

నడక ఇందిరాపార్కు వైపు మొదలైంది. ఎందుకనో మనసు ప్రశాంతత కోరుకుంటోంది. రక్తి లేనిచోట విరక్తి చోటు చేసుకోవటం, ప్రవృత్తిలో మార్పు కోరుకోవటం సహజం కాబోలు.

0-0-0

ఎదురుగుండా రామకృష్ణ మందిరం ప్రశాంతతకి వాకిలి. ఎన్ని ఆలోచనలువున్నా, అక్కడ అడుగుపెడితే మనసు ఏదో తెలియని లోకంలోకి దారి వెతుక్కుంటుంది. అదొక అద్భుత ప్రపంచం.

> 'ఆ ఏం చేస్తుంది ఫ్రెండ్స్ అందరికి, చుట్టాలకి ఫోన్ చేసి తను ఏమైపోయాడోనని ఆదుర్దా, హడావుడి చేస్తూ వుంటుంది. ఎంత లేదన్నా ఏడు గంటల తరువాత యింటి తలుపు తట్టటం తనకి అలవాటు లేని పనికదా! ఆ మాత్రం ఆత్రుత చూపించగలదని తనకి విశ్వాసం.

ఎప్పుడో ఏళ్ళకిందట వచ్చేవాడు రాఘవ అక్కడికి. ప్రశాంతత కోసం కాకపోయినా, ప్రపంచానికి దూరంగా వెళ్ళాలనుకున్నప్పుడు అక్కడ పది నిమిషాలు గడిపినా చాలు, హాయి తనని వెతుక్కుంటూ వచ్చిన సంఘటనలు గుర్తులేకపోలేదు రాఘవకి. యిప్పుడు కూడా అదే కావాలనుకుంటున్నా ఎందుకనో అటువంటి హాయిని కోరుకోవటం లేదు మనసు. ఆ పరిసరాలకి దూరంగా వెళ్ళిపోవాలనిపిస్తోంది.

ఇందిరాపార్కులోకి టిక్కెట్ కొనుక్కుని, లోనికి అడుగుపెట్టాడు రాఘవ. చాలా మారిపోయింది. ఎక్కడ చూసినా జనం, అందులో జంటలు ఎక్కువేమో. పక్షుల కిచకిచలతో, గొంతుల గుసగుసలు కలిసిపోయాయి. అక్కడక్కడ చిన్న పిల్లలతో ఆహ్లాదంగా ఆడుకుంటున్న తల్లి దండ్రులు.

పెళ్ళైన క్రొత్తలో మాలినితో కలిసి వచ్చాడు రాఘవ ఒక ఆదివారం సాయంత్రం ఆ పార్కుకి. అప్పట్లో జంటలు తక్కువ, ఫ్యామిలీస్ ఎక్కువగా వచ్చేవారు అక్కడికి. పిల్లలు గడ్డిలో ఆడుకుంటుంటే, దూరంగా నీడపట్టున కూర్చుని ముచ్చట్లాడుకుంటూ ఆనందానుభూతికి లోనవుతున్న తల్లి దండ్రులు.

పూరి నుంచి వచ్చింది కదా ఆనందిస్తుందనుకుంటే, మాలిని ఆ పరిస్థితులని ఆకళింపుచేసుకోలేక, "యింట్లో చోటు లేనట్లు, బహిరంగంగా ఏమిటా ముచ్చట్లు.

"మన సమాజంలో మగజాతి సంపాదన మీద వుంచిన దృష్టిలో పదిశాతం పెళ్ళాం మీద చూపిస్తే, జీవితంలో హాయి దానంతట అదే వెతుక్కుంటూ వస్తుంది." '

అసహ్యంగా పిల్లలు వున్నారని కూడా చూడకుండా'' ఈసడింపు గొంతుతో అన్నమాటలకి ఖంగుతిన్నాడు రాఘవ. మళ్ళీ యింకెప్పుడూ పార్కుమాట ఎత్తలేదు మాలిని ముందు. యిప్పుడు చూస్తే యింకెంత ఛీదరించు కుంటుందో, పెళ్ళికాని జంటల ముసుగుల గుసగుసలని.

చివరకంటూ వెళ్ళి, ఒక మూల గుసగుసలకి దూరంగా, కిచకిచలకి దగ్గరిగా చెట్టుకింద కూర్చున్నాడు రాఘవ. అలసటకి కళ్ళుమూతలు పడ్డాయి. అక్కడ కూడా వదలిపెట్టలేదు పల్లీలమ్ముకునే కుర్రవాడు. వాడిని పిలిచాడు దగ్గరికి. పది రూపాయలనోటుతో రెండు రూపాయల పల్లీలు, ఎనిమిది రూపాయల నిశ్శబ్దతని కొనుక్కున్నాడు. కుర్రాడి పనేమిటంటే అటువేపు ఎవ్వరూ రాకుండా చూడటమే.

కొన్ని పల్లీలు అయిపోయేసరికి మగతగా నిద్రముంచు కొచ్చింది రాఘవకి చెట్టు చాటు, చీకటి మాటున. అలసట శరీరానికే కాని, మెదడులో ఆలోచనలకి కాదన్న సంగతి పక్కకి నెట్టాడు రాఘవ. మనసు మాటవినదు, మాటలని మరువదు.

0-0-0

ఉదయం జరిగిన సంగతులు మదిలో మెదలుతున్నాయి రాఘవకి. ఉదయ్ ఎదురుపడి "ఎందు కంత చిరాకుగా వున్నారు? ఒంట్లో బాగోలేదా!" అడిగాడు బస్సుదిగి ఆఫీసులోకి వస్తుంటే.

ముఖం చిట్లించి 'ఈ వుదయ్‌గాడొకడు మనసులో సంగతులు యిట్లే పసిగడతాడు' అనుకుంటూ "ఏమీ లేదు, బాగానే వుంది '' పైకి చెప్పాడు రాఘవ.

"అంతలా అబద్ధాలు చెప్పకు. మనది పదిహేనేళ్ళ స్నేహం. ఆమాత్రం కనిపెట్టలేనా! యింట్లో ఏవన్నా గొడవా! కాకపోతే చెప్పు, గొడవ పడుదువుగాని, చిరాకు, చికాకు అన్నీ సర్దుకుపోతాయి. మాలినికి ఫోను చేసి మాట్లాడుతాను'' చెప్పుకుంటూ నడుస్తున్నాడు ఉదయ్ రాఘవ పక్కనే.

"ఒరేయ్ ! నువ్వు అన్నంత పనీ చేస్తావు. దయచేసి మా ఆవిడకు ఫోన్ చేయకురా బాబూ! మా గొడవేదో మేము పడతాము. సర్దుకుపోవటం చేతకాక కాదు. ఆ మాత్రం అనుభవం లేకపోలేదు ఈ పదేళ్ళలో. సర్దుకు పోవలసినవి చిరాకులు, చికాకులు కావు. మనుషుల మనస్తత్వంలో దాగివున్న స్వరూపాలు. అయినా ఇవన్నీ ప్రొద్దున్నే సంభాషించు కోవలసినంత అవసరం లేదు. నీకన్నీ టేకిట్ ఈజీ అలవాట్లు'' చెప్పాడు రాఘవ మొదటి అంతస్తు మెట్లెక్కుతూ, ఉదయ్ మళ్ళీ కలుస్తానని, లిఫ్ట్ వైపు అడుగులు వేశాడు. వాడిది నాలుగో అంతస్థులో సెక్షన్. ఎప్పుడైనా మెట్లు వాడతాడు.

మళ్ళీ మాలిని సంగతులే (మాటలే) మెదులుతుంటే, 'ఎవరికైనా చెప్పుకున్నా తీరుతాయా, మా మధ్య' సాగుతున్న మాటల యుద్ధాలు. ఏవిషయమైనా పిల్లల ముందు వాదన వద్దంటాను. అది చెవికి ఎక్కించుకోకుండా మళ్ళీ మళ్ళీ పునరావృతమవుతాయి యింట్లో పరిస్థితులు. తను నోరు మూసుకుంటే, మాటలాడేంత వరకూ వాదనకు ఫుల్‌స్టాప్ పెట్టదు. మాటలాడితే వాదనకు నేనే కారణమన్నట్టు సరాసరి పోరాటానికి సిద్ధం. యివన్నీ ఉదయ్‌కి చెప్పితే తీరుస్తాడా. వాడి కన్నీ యిందాకన్నట్లు ఈజీగా తీసుకునే తత్వం. బహుశా వాళ్ళావిడ మాటలకి 'సరేనని' తలూపుతాడో, లేక దులిపేసుకుంటాడో ఎవరికి తెలుసు. తను పనిచేసే సెక్షన్‌కి చేరుకునే సరికి ఆలోచనలలోంచి బయటికి వచ్చాడు రాఘవ.

0-0-0

దోమలు చెవిదగ్గర సంగీతం, శ్రావ్యంగా మాత్రం కాదు,' వినిపిస్తుంటే వులికిపాటుతో, కునుకులోంచి బయట పడ్డాడు రాఘవ. ప్రపంచంలో మనిషిని అతిగా విసిగించటంలో అతి చిన్నపాత్ర వహించేది దోమైతే, అత్యంత పెద్ద పాత్ర ఎవరో తెలుసా? భార్య లేక భర్త అని అనుకుంటే పొరపాటే. ఆ పాత్ర హద్దులు లేని,

ఆవలి ఒడ్డుకు చేరుకోలేని సువిశాలమైన 'మనసు'. ఆ మనసులో కోరికలనేకం. ఇది మానవ నైజం. ఆ కోరికలకి హద్దులు వుంచుకోవటం అవసరం. ఈ మాటలు ఎన్నోసార్లు చెప్పాడు రాఘవ మాలినికి. ఈ చెవితో విని, ఆ చెవితో బయటకి పంపించేస్తూ వుంటుంది.

అప్పటికి సాయంత్రం ఏడుగంటలయింది. దోమలకి దూరంగా, జంటలు లేని ప్రదేశంలో బెంచ్ మీద కూర్చున్నాడు రాఘవ. లైట్ల వెలుతురులో చెట్ల నీడలు నాట్యాలాడుతున్న వేళ, చందమామ లేక బోసిపోతున్న ఆకాశం. మబ్బులు లేక నక్షత్రాల మిలమిలలు, ఏదో వెలితిని అందిస్తున్నాయి ఆ ప్రదేశానికి. ప్రశాంతత కోసం వెదుగులాడుతున్న రాఘవకి ఆ ప్రశాంతత అంతగా నచ్చలేదు. ముఖానికి చేతులు అడ్డంగా పెట్టుకుని, ప్రపంచానికి దూరంగా పారిపోవాలన్న ఆలోచనలో మునిగిపోయాడు.

ఎప్పుడో, ఎక్కడో చదివిన మాటలు గుర్తుకొచ్చాయి రాఘవకి. 'ఈ జీవితం దేవుడు మనకిచ్చిన నిచ్చెనలాంటిది. మనకంటూ ఒకచోట నిర్ధారిస్తాడు. పైకి చూస్తే మనముండే అధమస్థితి, క్రిందికి చూస్తే మన ఉచ్ఛస్థితి కనిపిస్తాయి. అంత మాత్రాన మనస్థాయిని మార్చుకోవడానికి ప్రయత్నించడం అవివేకం' అనేది రాఘవ భావన. దానికి విరుద్ధంగా ఆలోచించటం లేక మాటలాడడం మాలినికి అలవాటు. తృప్తి, అసంతృప్తుల మధ్యన వారధి. మధ్యలో వూగిసలాడుతున్న వారిల్లు. అది యిద్దరికీ తెచ్చి పెడుతుంది 'ఇల్'.

ఇదే సంగతి చాలాసార్లు విన్నాడు తనకున్న యింకొక స్నేహితుడు మోహన్ వెంట. తను అంటూ వుంటాడు, "మన సమాజంలో మగజాతి సంపాదన మీద వుంచిన దృష్టిలో పదిశాతం పెళ్ళాం మీద చూపిస్తే, జీవితంలో హాయి దానంతట అదే వెతుక్కుంటూ వస్తుంది." ' వాడన్నది నిజమే అనుకున్నా, నా విషయంలో అలా జరిగిన సంఘటనలు మచ్చుకి ఒక్కటి కూడా లేదు. ఎప్పుడైనా ఆఫీసులో పని ఒత్తిడి వుంటే యింటికి లేటుగా వెళ్ళడం. ఆరోజే మాలిని ఏదైనా ప్రోగ్రాం వేసుకుని రెడీగా వుండటం. తరువాత చిర్రుబుర్రులు మామూలే. తొందరగా వెళ్ళిన రోజున యింటి చుట్టుపక్కల వాళ్ళతో చిన్న మహిళా మండలి మీటింగు జరుగుతుంటే, దానికి నేనేదో అడ్డుకున్నట్లు చూపులతోనే రుసరుసలు;

మా మధ్య సాగుతున్న మాటల యుద్ధాలు. ఏవిషయమైనా పిల్లల ముందు వాదన వద్దంటాను. అది చెవికి ఎక్కించుకోకుండా మళ్ళీ మళ్ళీ పునరావృత్తమవుతాయి యింట్లో పరిస్థితులు. తను నోరు మూసుకుంటే, మాటలాడేంత వరకు వాదనకు ఫుల్‌స్టాప్ పెట్టదు. మాటలాడితే వాదనకు నేనే కారణమన్నట్టు సరాసరి పోరాటానికి సిద్ధం.

ఎందుకంటే మాటలతో అందరిముందు బాగుండదని కాబోలు.'

0-0-0

కర్ర చప్పుడుతో ఈలోకంలోకి వచ్చాడు రాఘవ. ఎదురుగుండా వాచ్‌మన్ అక్కడక్కడ కూచున్న వాళ్ళని పంపించేస్తున్నాడు. టైము చూసుకుంటే ఎనిమిది గంటలు. ఆలోచనలతో టైము ఇట్టే గడిచిపోతోంది. అక్కడక్కడ కొన్ని తప్ప, చాలా వరకు లైట్లు ఆర్పేసి వున్నాయి. రాఘవ గమనించలేదు. యిప్పుడు పార్కు నుంచి బయటికి వెళ్ళాలి. తను కోరుకున్న ప్రశాంతత వచ్చిన ఛాయలు లేవు రాఘవ ముఖాన అలసటని భుజాన వేసుకుని నడుస్తున్నట్లున్నాడు.

గేటు బయటికి వెళ్ళబోతుంటే, కుడివైపు కొంచెం దూరంగా రెండు గదుల యిల్లు. వాచ్‌మన్ క్వార్టర్స్‌లా వున్నాయి. మెట్లమీద వాచ్‌మన్ భార్య కాబోలు, కూరలు తరుగుతూ, తల ఎత్తి మధ్య మధ్యలో అటూ యిటూ చూస్తోంది తలుపులకి తాళాలు వేసి యింటికి వచ్చే పెనిమిటి కోసం. యింటి ముందున్న లైటు కింద చదువు కుంటున్న యిద్దరు పిల్లలు. 'నిశ్శబ్ద వాతావరణంలో ముచ్చటైన దృశ్యం. రోజూ వీళ్ళకి యింతటి హాయి వుంటుంది కాబోలు.' అనుకుంటున్న రాఘవకి అప్పుడు అనిపించింది. 'బాధలను దూరం చేసుకోవటం కోసం భావాలకి దగ్గర అవుతున్నానని'.

యింటిని మరచి, కలతలతో సతమతమవుతున్న రాఘవ మదిలో కలవరింతలో తనవారిని దూరం చేసుకో

లేకపోతున్నాడు. మాలిని యీపాటికి ఏమి చేస్తూ ఉంటుందో వూహించుకుంటూ టాంక్ బండ్ పైకి మెట్లెక్కి వెళ్ళాడు.

'ఆ ఏం చేస్తుంది ? ఫ్రెండ్స్ అందరికి, చుట్టాలకి ఫోన్ చేసి తను ఏమైపోయాడోనని ఆదుర్దా, హడావుడి చేస్తూ వుంటుంది. ఎంత లేదన్నా ఏడు గంటల తరువాత యింటి తలుపు తట్టటం తనకి అలవాటు లేని పనికదా! ఆ మాత్రం ఆత్రుత చూపించగలదని తనకి విశ్వాసం. నెమ్మదిగా యింటికి చేరవచ్చులే. ఎదురు మాటలే కాదు ఎదురు చూపులు చూడటం నేర్చుకోవాలనే కదా తను లేటుగా వెళ్ళేది.

లంచ్ టైములో భరత్ అన్న మాటలు గుర్తుకొచ్చి, చిన్నగా నవ్వుకుంటూ, తెలుగు ఘనుల విగ్రహాల ముందు నుంచి పేవ్‌మెంట్ మీద నడుస్తున్నాడు.

"రాఘవా! నువ్వేన్నయినా చెప్పు, ఎంతలా అన్నా భావించు నాకేమీ ఫర్వాలేదు. స్నేహితుడన్నాక బాగుపడాలనే మాటలే చెబుతాడు. నువ్విలా మౌనంగా వుంటే సమస్యలు తీరుతాయనుకోవటం చాలా పొరపాటు. ఆలుమగలన్నాక ఏవో చిన్న చిన్న గిల్లికజ్జాలు సహజం. ఎప్పుడూ నువ్వు, నీవైపు నుంచే ఆలోచిస్తావు. మాలిని వైపు నుంచి కూడా కొంచెం అర్థం చేసుకోవచ్చు కదా! సారీ బాస్! యిలా చెబుతున్నందుకు"

'చెప్పేవాడికి వినేవాడు లోకువ. యిటువంటి సలహాలు తను చాలాసార్లు స్నేహితుల మధ్య చెప్పుకున్నట్లు గుర్తు. సమస్యల వలలో చిక్కుకున్న వారిని విడిపించి, ఆచరణలోకి తీసుకురావటం కష్టం. వారంతట వారే బయటకు రావాలి. అంత మాత్రాన అటువంటి వారు అనుపాయులు అనుకోవటం తప్పు. ఆ సంగతి తనకే తెలుసు.' మనసులో అనుకుంటూ టాంక్ బండ్ రోడ్డు ఆవలికి వెళ్తే, ఒక్క బెంచ్ కూడా ఖాళీగా లేదు. కాళ్ళు పీకుతుంటే రైలింగ్ వైపు వంగి ఆనుకొని నిల్చున్నాడు రాఘవ.

తళతళలాడే దీపాల నీడల మెరుపుల మధ్య బుద్ధుడు ఎంత స్థిరంగా నిలుచున్నాడు. నిర్మలంగా, నిశ్చలంగా, నిర్లిప్తంగా చిరునవ్వు చిందిస్తున్నాడు. రాఘవ ఏదో ఆలోచన కలిగి, వెంటనే పార్కులో పల్లీలతో పాటు వచ్చిన న్యూస్ పేపర్ ముక్క కోసం జేబులో వెతికాడు. అప్పుడు పార్కులో చెత్తబుట్ట దగ్గరలో కనిపించక, మడతబెట్టి ఫ్యాంట్ బాక్ పాకెట్‌లో పెట్టుకున్నాడు. అందులో వాక్యాలు చదివి, బుద్ధుని వంక ఒకసారి వినమ్రంగా చూసి యింటికి బయలు దేరాడు.

0-0-0

రాత్రి తొమ్మిది గంటలు దాటి అరగంట పైబడింది. నెమ్మదిగా యింటి తలుపు తీసుకుని చప్పుడు చేయకుండా లోపలికి అడుగుపెట్టాడు. తననుకున్న దానికి విరుద్ధంగా, పిల్లలిద్దరూ నిద్రలో జోగుతున్నారు. మాలిని డైనింగ్ టేబిల్ మీద తలవాల్చి అలసిన ముఖంతో బడలికగా నిదురించటం గమనించి, కించిత్తు ఆశ్చర్యపోయాడు రాఘవ. నెమ్మదిగా సడి లేకుండా డ్రెస్ మార్చుకుని, కంచంలో పెరుగన్నం కలిపి, మాలిని చెవిలో "మాలినీ! నేనొచ్చేశాను. అన్నం తిన్నట్టు లేవు. కొంచెం పెరుగన్నం తిని పడుకో" అంటూ ముద్దలు తినిపించసాగాడు. నిద్రమత్తులో మాలిని సగం అన్నం తిని "ఏవండీ మీరు అన్నం తిన్నారా! నేను అన్న చిన్న మాటలకే యింత పట్టింపయితే ఎలాగండీ!" రాఘవ "ఎక్కువ మాట్లాడకు, నిద్ర తేలిపోతుంది. నేను అన్నం తిన్నానులే. హాయిగా పడుకో" అని మాలినిని తీసుకెళ్ళి బెడ్ మీద పడుకోబెట్టి దుప్పటి కప్పి, పక్కనే తను కూడ నిద్రకుపక్ర మించాడు.

అప్పుడు మళ్ళీ మదిలో మెదిలాయి. పల్లీల వాడిచ్చిన పేపర్‌లోని మాటలు, దలైలామాచే చెప్పబడిన భాషితం " అప్పో దీపో భవ (నీకునువ్వే మార్గం చూపుకో... జ్యోతిగా వెలుగు బాటను పరచు)". పేపర్ ముక్క మడత బెట్టి దిండు కింద దాచుకుంటూ అనుకున్నాడు రాఘవ, 'యిల్లు కాబోదు ఎప్పటికీ "ఇల్" అది ఎల్లప్పటికీ నాలుగు గోడల మధ్య వుండే "థ్రిల్" నిద్రలోకి పయనిస్తూ.....!

**రంజని నిర్వహించిన రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక ఉగాదికథల పోటీలలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ.**